నీతి! 'రోజీ'

పూ్యను తెచ్చి పెట్టిన ఫైళ్ళు చూస్తున్నాడే గాని, వాటిపైన మనస్సు లగ్నం కావడంలేదు. పై జేబులో పెట్టుకున్న కన్నతల్లి వ్రాసిన ఉత్తరాన్ని తీసి, విప్పి ఫైల్లో పెట్టుకుని చదువసాగాడు. చదవడం బహుశ ఏ పదో సారి అనే చెప్పుకోవాలి

"చిరంజీవి చిన్నాను దీవించి, అమ్మ వ్రాయునది. అంతా క్షేమము. మీరూ క్షేమంగా వుండాలని నిత్యం భగవంతున్ని ప్రార్థిస్తాను. నేను నీకు వ్రాసిన ప్రతి వుత్తరంలోను డబ్బు ప్రసక్తి తీసుకు రావడం తప్పనిసరి అవుతోంది. అయినను నేను ఎంతో అవసరం వుంటే తప్ప వ్రాయనని నీకు తెల్సిందే. ముఖ్యంగా ఇంటి అద్దె కట్టమని, ఇంటాయన చాలా నిష్ఠూరంగా మాట్లాడుతున్నాడు. వారం రోజుల్లో అద్దె చెల్లించకుంటే ఇల్లు ఖాళీ చేయాల్సిందిగా హెచ్చరించాడు.

పోతే చెల్లాయి సుశీల పెద్దమనిషైంది. అందువల్ల అదనంగా కొత్త ఖర్చు వచ్చిపడింది. ఆచారం ప్రకారం ఏ కొద్దిమందినైనా పిలిచి బంతి పెట్టాలి, కొత్త బట్టలు, ఓణిలు కొనాలి. పొలంలో వచ్చిన తిండి గింజలు మొన్ననే అయిపోయాయి. బియ్యం కూడా నిండుకున్నాయి. సుశీల పదవ తరగతిలో పాసైన విషయం నీకు తెల్సిందే. తను ఇంటర్‌లో చేరతానని మారాం చేస్తోంది. టైపు నేర్చుకుంటోంది. ఎంతో కొంత మొత్తం సర్ది పంపిస్తే, తాత్కాలికంగా సంసారాన్ని నెట్టుకు వస్తాను.

కోడలు పిల్లను అడిగినట్లు చెప్పగలవు. బాబులిద్దరకు శుభాశిస్సులు. ఆరోగ్యం జాగ్రత్త. ఇక ఉంటాను.

సదా నీ క్షేమాన్ని కోరే
అమ్మ."

ఉత్తరం చదవడం పూర్తి చేసి భారంగా నిట్టూర్చాడు. నాన్న అక్కయ్య పెళ్ళికి ఇల్లు అమ్మేశాడు. ఇల్లు కాకుంటే ఉన్న ఎకరం పొలం అమ్మేయమని అంటే ససేమిరా ఒప్పుకోలేదు. ఇల్లు లేకుంటే వేరే ఎవరింట్లోనైన ఉండచ్చు కాని పొలం అమ్మితే ఆ నాలుగు తిండి గింజలు రాక కష్టమౌతుంది అనే ఉద్దేశ్యంతో ఇంటినే అమ్మేశాడు. పెళ్ళయిన కొద్ది రోజులకే గుండెపోటుతో మరణించడం జరిగింది. ఏ ప్రయత్నం లేకుండానే తనకి ఉద్యోగం రావడం జరిగిందంటే నాన్న మంచితనం వల్లే.

ఉన్న పొలం కౌలుకిచ్చేసి తనతో రమ్మంటే అమ్మ ఒప్పుకోదు. ఊళ్లోనే వుండి కూలో నాలో చేసుకుని బ్రతుకుతానంటుంది. తోడుగా చెల్లాయిని వుంచుకుంది. అయినా చాలి చాలని జీతాలు, ఇద్దరు పిల్లలు, తన సంసారానికే చాలదు. అమ్మ మాత్రం భారంకాదు.

ఆలోచిస్తున్నకొద్ది ఏమి పాలుబోవడం లేదు. మూర్తికి. నెలాఖరు రోజులు. చేతిలో ఏమిలేదు. వేరే ఎవరి వద్ద నుంచైనా తెస్తే మళ్ళీ సర్దడం చాలా కష్టం.

మూర్తి చివరకు ఈ విధంగా కూడా ఆలోచించాడు. తను పనిచేస్తున్నది. రెవిన్యూ డిపార్టుమెంటు, అందులోను తనది సివిల్ సప్లయిస్ విభాగం. తను కావాలని చేయి చాచాలే కాని, సాయంత్రానికి జేబులు నిండుతాయి. కాని మూర్తికి మనసొప్పదు. తండ్రి పేరు ధర్మరాజు. ధర్మం తప్పి ఎరగడు. నీతి, న్యాయం అంటూ జీవితకాలం పోరాడాడు. అందుకే కాబోలు తన పేరు సత్యమూర్తి అని పెట్టాడు అనుకుంటాడు. పరిస్థితులు ఎంత విషమించిన, తిండికి లేకున్నా పస్తులుండాలి తప్పితే నీతిమాలిన పనులు చేయవద్దని బోధించేవారు. నీతి, న్యాయం, ధర్మం ఆయన ఆరో ప్రాణం. అంతటి సచ్ఛీలత కల వ్యక్తి కడుపున పుట్టిన తను. ఆయన క్రమశిక్షణలో పెరిగి, నేడు లంచం పుచ్చుకుంటే ఆయన ఆత్మ శాంతించదు. పైగా తనను తాను వంచించుకోవడమే అవుతుంది.

"మరి ప్రస్తుత సమస్యకు పరిష్కారం-?" తల పట్టుకుని కూర్చున్నాడు మూర్తి.

"సార్ మీరు చాలా దల్‌గా కనపడుతున్నారు. తలనొప్పి వుంటే టీ తెచ్చి పెడ్తాను సార్ ...!" టేబుల్ వద్దకు వచ్చి ఆప్యాయతతో అడిగాడు ప్యూను ఎల్లయ్య.

"అవును లక్ష్మయ్యా! టీతో పాటు ఒక 'నవాల్జిన్' మాత్ర కూడా పట్టుకురా!" చెప్పాడు మూర్తి.

ఆఫీస్ టైమ్ పూర్తి కావస్తోందనగా లక్ష్మయ్య తెచ్చిన మాత్ర వేసుకుని టీ త్రాగి, ఫైళ్ళు, కాగితాలు వగైరా అన్ని తన బీరువాలో సర్దేసి తాళం పెట్టి, ఆఫీసులోంచి బయటకు వచ్చాడు. ఆఫీసు స్టాఫ్ తమ తమ స్కూటర్లు తదితర వాహనాలపై ఇళ్ళకు బయలుదేరి వెళ్తున్నారు. డిపార్టుమెంటులోకి వచ్చిన సంవత్సరానికే వెహికల్స్ కొనేస్తున్నారు. న్యాయంగా, నీతిగా బ్రతికితే యిది సాధ్యమా? ఆలోచించుకుంటూ కాలినడకన సాగుతున్నాడు.

బజార్లోకి వచ్చాక గాని గుర్తుకు రాలేదు. భార్య చెప్పిన సరుకుల జాబిత. సరుకులు కొనడానికి డబ్బులేదు. కొనకుండా వెళ్తే వస్తు తప్పదు. సంవత్సరంలోని ప్రతినెల ఫిబ్రవరి అయితే కొంత నయంగా వుండేది. ఆలోచనల్లో పడి ఇంటికి చేరిన విషయం గమనించనే లేదు.

గడప దగ్గరే నిలబడిన భార్య" సరుకులు అన్ని తెచ్చారా?" అని అడగబోయి, వట్టి చేతులను చూసి ఆగిపోయింది.

లోపలికి అడుగు పెట్టగానే "మరేనండి పిల్లలిద్దరు ఈ రోజు స్కూలుకి వెళ్ళిన అరగంటకే వాపసు వచ్చారు. ఎందుకు అని అడిగితే ఏడుస్తున్నారే తప్పితే జవాబు చెప్పడంలేదు. కాస్త మీరైనా కనుక్కోండి" అంటూ మూర్తికి చెప్పింది భార్య శాంత.

ప్యాంటు విప్పకుండానే పక్క గదిలోకి నడిచాడు మూర్తి. ఆ గదిలో పుస్తకాలు ముందేసుకుని కూర్చున్నారు ఇద్దరు పిల్లలు. దగ్గర వెళ్ళి కూర్చున్నాడు.

"నాన్నా ఈ రోజు స్కూలు నుండి వాపసు వచ్చారంట ఎందుకు?" పెద్ద బాబును బుజ్జగించి అడిగేడు.

ఒకసారి తండ్రి మొహంలోకి చూసి, మళ్ళి విచారంగా పుస్తకంలోకి చూడసాగారిద్దరు. చిన్నవాడి వైపు చూసినా ఏమి చెప్పలేదు. ఏం అర్థంకాలేదు.

"చెప్పు నాన్నా!" అంటూ గదవ పట్టుకుని బ్రతిమాలాడు మూర్తి.

"మరి . మరి ఫీజు కట్టలేదని టీచర్లు వెళ్ళగొట్టింది. ఫీజు కడితేగాని స్కూలుకి రానీయనంది" అంటూ బోరున ఏడుస్తూ తండ్రి ఒడిలో ఒదిగిపోయారు.

గుండెను ఎవరో పిండినట్టయింది. ఫీజు పోయిన నెల కూడ కట్టలేదు. ఫీజు కట్ట లేదని రానీయలేదు. చదువు పట్ల పిల్లలకున్న అసక్తి ఈ విధమైన బాధల వల్ల చిన్నారుల మనస్సు గాయపడి చదువు పట్ల శ్రద్ధ పోతుందనిపించింది మూర్తికి. తలంతా మొద్దుబారింది. ఏమిటి కర్తవ్యం?

పిల్లలను ఊరడించి వాళ్ళిద్దర్ని లేవనెత్తి బాత్రూంకి తీసుకెళ్ళి వాళ్ళ మొహాలు కడిగి, తను కడుక్కుని ముందు గదిలోకి వచ్చి టవల్‌తో తుడుస్తూ కుర్చీలో కూర్చున్నాడు.

సంఘాలు

పదవుల్లో ఉన్న వారికి
పంపులు కొట్టే సంఘాలు కొన్ని
ఈర్ష్యాద్వేషాలతో 'కంపు' కొట్టే సంఘాలు కొన్ని
స్వార్థ చింతన లేని సంఘాలు ఎన్ని
సరిగ్గా చూస్తే చేతివేళ్ళన్ని!

—డా. బి. దామోదర్ రావు

నీతి!

"ఇదిగోండి కాఫీ!" శాంత అందించిన కాఫీ తను గుక్కెడు తాగి, పిల్లలిద్దరకు తాగించాడు. అప్పుడు కాని వాళ్ళలో ఉత్సాహం ఏర్పడలేదు. తుర్రున బయటకు పరుగెత్తికెళ్ళారు పిల్లలిద్దరు.

అప్పటి వరకు మౌనంగా వున్న శాంత ... "ఏమండీ . ఈ రోజు మధ్యాహ్నం మార్వాడి వచ్చి చాలా గొడవ చేసి వెళ్ళాడు. బాబు ఆపరేషన్‌కి నా గొలుసు తాకట్టు పెట్టిన డబ్బు విషయం. వారం పది రోజులలో డబ్బు చెల్లించి గొలుసు పట్టుకుపొండి. లేదా తన డబ్బుకి గొలుసు చెల్లుబాటని చెప్పాడు ..." మెల్లిగా, జీరాడుతున్న గొంతుతో చెప్పింది.

మరో దెబ్బ. నవనాడులు కృంగిపోయినట్టయింది. ఆర్థిక సమస్యలు ఒకటి వెంట ఒకటి వచ్చి పడుతున్నాయి. భగవాన్ ఏమిటీ పరీక్ష. నీతి, న్యాయం అంటు బ్రతకాలంటే సాధ్యమా? ఈ ఆర్థిక సమస్యల సుడి గుండంలోంచి బయటపడ్డం సాధ్యమా? మెదడు నరాలు చిట్లిపోతున్నాయనిపించింది.

తల్లికి డబ్బు పంపించాలి; పిల్లల ఫీజు కట్టాలి; కిరాణా కొట్టు పద్దు కట్టాలి; తాకట్టు పెట్టిన నగ విడిపించుకోవాలి; మళ్ళి యధావిధిగా ఇల్లు గడవాలి.

ఇవన్ని సాధ్యమా? నీతికి గుర్తింపేది? ప్రతి విషయాన్ని నైతికంగా ఆలోచించే బదులు, మారుతున్న కాలానికి అనుగుణంగా తను మారితే -? కాని తండ్రి ఆశయం, క్రమశిక్షణ మట్టిపాలయినట్టే. మరి ఎలా?

ఆ రాత్రి పెద్దవాళ్ళిద్దరు పస్తే! పొద్దున మిగిలినది పిల్లలిద్దరికీ చాలలేదు. వాళ్ళ పరిస్థితికి పరిహసిస్తున్నట్టు కిటికీ రెక్క గాలికి కొట్టుకుంది. ఓ క్షణం కిటికీ వేపు చూసి కృంగిపోయాడు.

* * * * *

నిన్న పొరపాటున తల్లి వ్రాసిన ఉత్తరం ఫైల్లో మరిచిపోయిన సంగతి బీరువా తీసాక గాని గుర్తుకు రాలేదు. నిన్నటి ఫైలు అందుకుని ఉత్తరం తీసాడు.

ఆశ్చర్యం! ఉత్తరంలో మడిచిపెట్టిన వంద రూపాయల నోట్లు అయిదు వున్నాయి నిన్న తను పెట్టినపుడు లేవు. ఈ రోజు అందులోకి ఎలా వచ్చాయి? ఆలోచించి చివరకు బీరువాను నిశితంగా పరిశీలించాడు. మారు తాళాలతో బీరువాను తెరిచి అందులోని ఫైళ్ళను కదిపినట్లుగా వున్నాయి. ఫైళ్ళు ఏవైన పోయాయా అని జాగ్రత్తగ చూసాడు. కాని అన్ని సరిగ్గావున్నాయి.

ఫైళ్ళు కదిలించకుండా, అందులో డబ్బు పెట్టింది ఎవరు? తను యిప్పుడేం చేయాలి?

డబ్బు కంటబడగానే సమస్యలన్ని కళ్ళ ముందు మెదిలాయి. చాలా సేపు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు.

ఉత్తరం, ఫైలు, పట్టుకుని తన ఆఫీసరు గదిలోకి నడిచాడు. అక్కడ మరో ఇద్దరు వ్యక్తులు కొత్తవాళ్ళు కూర్చుని ఏదో మాట్లాడుతున్నారు. ఒక్క క్షణం నిలబడి మెల్లిగా దగ్గాడు మూర్తి.

అలికిడి గమనించిన ఆఫీసరు మూర్తిని దగ్గరకు పిలిచాడు.

"ఏమిటి?" ప్రశ్నించాడు.

మూర్తి ఉత్తరంలోని డబ్బుని టేబుల్‌పై పెట్టి, పరిస్థితిని, ఆ డబ్బు ఎలా వచ్చింది తనకు అర్థం కావడంలేదని తనేం చేయాలని పూర్తిగా వివరించాడు. విషయాన్ని గురించి ఆఫీసరు చాలాసేపు మౌనంగా వుండి -

"చూడు మిస్టర్ మూర్తి! నీ మంచితనం నాకు తెలుసు. నీవెంతటి నిజాయితిపరుడవో, కార్యదీక్షత కలవాడివో నాకు తెలుసు. నీలాంటి వాళ్ళు నేటి కాలంలో చాలా అరుదు. అయినా నీవు చెప్తున్న విషయం నమ్మశక్యంగా లేదు. బహుశా నీవే డబ్బు అందులో పెట్టి మరిచిపోయి వుంటావు. మరోసారి ఆలోచించు ..." అగాడుపై అధికారి.

"నో సర్! ఇంపాజిబుల్! నేను మరిచిపోవడం జరగని పని. అయినా నెలాఖరు యింత డబ్బు నా వద్ద ఎక్కడివి సార్! అది ఎలా వచ్చిందో, ఎవరిదో నా కవసరంలేదు. నాకొచ్చే జీతం సరిపోకపోతే ఒక్క పూట పస్తుంటాను తప్పితే, తేరగా వచ్చే డబ్బును నా జన్మలో ఆశించను. అవినీతి అనేది నా బద్ధశత్రువు సర్!" రుద్ధమైన కంఠంతో గంభీరంగా చెప్పాడు.

అప్పటి వరకు శ్రోతలుగా ఉన్న కొత్త వ్యక్తులిద్దరూ లేచి "వెల్ మై డియర్ బోయ్! నీయొక్క నిజాయితీకి మా జోహార్లు. నీతి అనేది నీ నరనరాల్లో జీర్ణించుకు పోయింది. ఇంతకు మేమెవరో చెప్పలేదు కదు. మేము అవినీతి నిరోధక శాఖకు చెందిన ప్రత్యేకాధికారులము. మా శాఖలో బర్తీ కోసం నిజాయితీ కల వ్యక్తులను వేటాడుతున్నాం.

నీ కాన్ఫిడెన్షియల్ రిపోర్టు చూసి, నీ ఆర్థిక పరిస్థితిని గమనించి నిన్ను రహస్యంగా వెంటాడి, నీ ఇంటి పరిస్థితులు, డబ్బు యొక్క అవసరం చూసి, డబ్బు అందులో పెట్టాము. అయినా నీవాశించలేదు. నీలాంటి వ్యక్తులు మా ఎ. సి. బి కి అత్యవసరం. నిన్ను మా శాఖలో అధికారిగా నియమిస్తున్నాము. నీకు అన్ని అర్డర్లు త్వరలో అందుతాయి." మూర్తితో కరచాలనం చేస్తూ చెప్పారిద్దరూ.

కలా? నిజమా? ఆశ్చర్యంతో, ఆనందం మునిగిపోయాడు మూర్తి తమ ఆఫీసరు కూడా చేయి కలపడంతో ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు.

నీతి! నీకింకా గుర్తింపు వుంది. అనుకున్నాడు మూర్తి!

అతని మనస్సు ఆనందంతో ఉరకలు వేసింది. □